క్రీడా మైదానాలకు స్థలాలు కరువు

- 69 మైదానాలకు ఆరు మాత్రమే పనులు ప్రారంభం
- స్థలాల ఎంపిక కోసం అధికారుల పాట్లు



కొట్ర ఉన్నత పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన క్రీడా మైదానం బోర్డు

వెల్దండ: గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించి క్రీడాకారుల్లో నైపుణ్యతను వెలికి తీసేందుకు ప్రభుత్వం పల్లెల్లో క్రీడా మైదానాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. అధికారులు రెండు, మూడు చోట్ల నామమాత్రంగా ఏర్పాటు చేసి మమా అనిపించారు. ఏర్పాటు చేసిన చోట పరికరాలు కనిపించడం లేదు. గ్రామ పంచాయతీలతో పాటు వాటి పరిధిలోని ప్రతి అవాస గ్రామంలో గ్రామీణ క్రీడా మైదానాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో అధికారులు ప్రభుత్వ స్థలాల కోసం అన్వేషణ ప్రారంభించారు. కానీ ఎక్కడా ప్రభుత్వ స్థలాలు దొరకడం లేదని పేర్కొంటున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల అవరణలో ఉన్న కొద్దిపాటి స్థలంలో ఒకటి, రెండు ఆటలకు సంబంధించిన కోర్టులను ఏర్పాటు చేయడానికి సన్నద్ధమవుతున్నారు.

32 గ్రామ పంచాయతీలకు 6మాత్రమే..

మండలంలోని మొత్తం 32 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రతి గ్రామానికి ప్రభుత్వ క్రీడా మైదానాలను మంజూరు చేసింది. అదేవిధంగా పంచాయతీలకు అనుసంధానంగా ఉన్న అవాస ప్రాంతాలైన మరో 37 గ్రామాల్లో మైదానాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీంతో మొత్తం 69 గ్రామాల్లో ఏర్పాటు చేయాల్సిన క్రీడామైదానాలను కేవలం 6చోట్ల మాత్రమే ఏర్పాటు చేశారు. వాటిలోనూ అసంపూర్తిగా క్రీడా మైదనాలను ఏర్పాటు చేసి అధికారులు, ప్రజాప్రతినిధులు చేతులు దులుపున్నారు. వాటిని కూడా కొన్ని చోట్లు గ్రామానికి కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేయడంతో వినియోగంలోకి రాకుండా పోతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మండలంలోని పెద్దాపూర్, నారాయణపూర్, వెల్దండ, ఉబ్బలగట్టుతండా, గాన్‌గట్టుతండా, శంకరకొండతండా, సిలోనిబావితండాల్లో స్థలాలను ఎంపిక చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. త్వరలోనే మైదానాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. మిగిలిన 56చోట్ల క్రీడా మైదానాల స్థలాల కోసం రెవెన్యూ అధికారులతో కలసి సర్వేచేస్తున్నట్లు వివరించారు. ఇప్పటి వరకు కొట్రలో ప్రభుత్వ పాఠశాల ఆవరణంలో, కుప్పగండ్ల, పోషమ్మగడ్డతండా, చౌదర్‌పల్లి, లింగారెడ్డిపల్లి, పోతేపల్లిలో గ్రామ సమీపంలోని ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేశారు. మట్టివేసి చదును చేసిన ప్రభుత్వం వాటికి బిల్లులు చెల్లించలేదు.

స్థలాన్ని బట్టి నిధులు..

క్రీడా మైదానానికి దొరికిన స్థలాన్ని బట్టి నిధులు మంజూరు చేస్తారు. ఈ మైదానాల్లో కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, హైజంప్ కోర్టులు ఉండాలి. వ్యాయమం కోసం సింగిల్‌బార్, డబుల్ బార్‌లు ఏర్పాటు చేస్తే స్థలాన్ని బట్టి రూ.2.50లక్షల నుంచి రూ.4లక్షల వరకు నిధులు మంజూరు చేస్తారు. క్రీడా మైదానానికి కనీసం 20గుంటల నుంచి ఒక ఎకరం స్థలం ఉండాలని నింబంధనలు ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. అన్ని క్రీడలకు సరిపడా స్థలాలు దొరకడం లేదు. క్రీడా మైదానాలకు ప్రభుత్వం నుంచి నిధుల మంజూరుపై ఆసక్తి చూపడం లేదని, గ్రామ పంచాయతీల పాలకవర్గం ఆసక్తి కనబర్చటం లేదని చర్చించుకుంటున్నారు.

స్థలాల కోసం సర్వే చేస్తున్నాం..



గ్రామాల్లో ప్రభుత్వ స్థలాల కోసం రెవెన్యూ అధికారులతో సర్వే చేయిస్తున్నాం. ఇప్పటికే తహసీల్దార్, సర్వేయర్‌తో ఆయా గ్రామాల్లో ప్రభుత్వ భూములను సర్వే చేసి 7గ్రామాల్లో గుర్తించాం. అదేవిధంగా లేవంట్ ప్రాంతంలో 10శాతం ఇచ్చిన స్థలాలను ఎంపిక చేయడానికి కృషి చేస్తున్నాం. ఇప్పటి వరకు 69 క్రీడా మైదానాలకు గాను 6 ప్రాంతాల్లో పూర్తి చేశాం. మరో 7 ప్రాంతాల్లో స్థలాలను ఎంపిక చేశాం. త్వరలోనే అన్ని గ్రామాల్లో క్రీడా మైదానాలకు స్థలాలను ఎంపిక చేసి వినియోగంలోకి తీసుకువస్తాం.

– మోహన్‌లాల్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ, వెల్దండ

క్లుప్తంగా

గడ్డంపల్లిలో వైద్యశిబిరం



తెలకపల్లి: మండలంలోని గడ్డంపల్లిలో ఆదివారం ఎంపీపీ కొమ్ము మధు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. హైదరాబాద్‌లోని అంకిత్ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి సహకారంతో వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. బీపీ, షుగర్‌తో పాటు వివిధ రకాల దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మయ్య, ఉపసర్పంచ్ మమత, డాక్టర్ నవీన్, శ్రీకాంత్‌రెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షుడు మధు, మాజీ సర్పంచ్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కల్వకుర్తిరూరల్: మండలంలోని కురుమిద్దకు చెందిన స్వప్న గుండె సంబంధిత వ్యాధితో ఇబ్బందులు పడుతుంది. సమాచారం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం కురుమిద్ద తండాను సందర్శించారు. స్వప్న తండ్రి సంతోష్‌తో ఆరోగ్య పరిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి గోలి శ్రీనివాస్‌రెడ్డి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సుభాష్, సతీష్, శ్రీనునాయక్, వినోద్‌నాయక్ తదితరులు ఉన్నారు.

కొల్లాపూర్: పట్టణంలోని 11వ వార్డులో అనారోగ్యంతో మరణించిన బోగిని పురుషోత్తం కుటుంబానికి స్థానిక నాయకులు గుండ్రాతి కిరణ్‌తేజ గౌడ్ రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్‌గౌడ్, రమేష్‌నాయుడు, బిజ్జ రమేష్ తదితరులు ఉన్నారు.

స్వయం ఉపాధితో ఎదగాలి

కల్వకుర్తిరూరల్: నిరుద్యోగ యువతీ, యువకులు కేవలం ఉద్యోగాల కోసయే ఎదురు చూడకుండా స్వయం ఉపాధి అవకాశాలను సాధించాలని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలో రేకులు తయారు చేసే పరిశ్రమను ఎమ్మెల్సీ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ భూపతిరెడ్డి, కౌన్సిలర్లు శ్రీనివాస్, సతీష్, రాంరెడ్డి, నాయకులు సుదర్శన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, దామోదర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

నేడు ఆత్మార్పణ దినోత్సవం

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో సోమవారం అమ్మవారి అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ రమేష్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో కార్యక్రమాలకు హాజరు కావాలని ఆయన కోరారు.

మరిన్ని సేవలు అందించాలి

కల్వకుర్తి: లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కల్వకుర్తి లయన్స్ క్లబ్ ద్వారా పేద, సామాన్య ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని కోరారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన కల్వకుర్తి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కల్మిచర్ల రమేష్, కార్యదర్శి శ్రీధర్‌లను అభినందించారు.

శిథిలావస్థలో పశువైద్య ఉపకేంద్రం



తాడూరు: మండలంలోని మేడిపూర్ పశువైద్య ఉపకేంద్ర భవనం శిథిలావస్థకు చేరుకుంది. పదేళ్ల కిందట నిర్మించిన భవనం బీటలువారి శిథిలావస్థకు చేరుకుంది. విధులు నిర్వహించే సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించి తాత్కాలిక మరమ్మతు చేపట్టాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

బహుమతుల ప్రదానం

ఊర్కొండ: మండలంలోని ఊర్కొండపేటలోని ఆంజనేయుడి బ్రహోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ విజేతలకు ఆదివారం నిర్వాహకులు బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించారు. మండల కేంద్రంలో ఎంజేఆర్ యూత్ సభ్యులు నిర్వహించిన క్రీడల్లో భాగంగా వివిధ గ్రామాల నుంచి పాల్గొన్న జట్లలో మొదటి విజేతగా నిలిచిన ఊర్కొండ జట్టుకు భారతి సిమెంట్స్ డీలర్ కరుణాకర్ రెడ్డి సమకూర్చిన రూ.20వేల నగదు, ద్వితీయ విజేత ఊర్కొండపేట జట్టుకు మండల బీఆర్‌ఎస్ నాయకుడు జనార్దన్ రెడ్డి సమకూర్చిన రూ.10వేల నగదుతో పాటు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజయ్య, నాయకులు శ్రీనివాసులు, వెంకటయ్య, నరేష్, శ్రీశైలం, మనోహార్, మల్లేష్, అశోక్, సురేష్ పాల్గొన్నారు.



కేఎల్‌ఐ కాల్వల నిర్వహణపై నిర్లక్ష్యం


చెట్లు పెరిగి కుంచించుకపోయిన కేఎల్‌ఐ కాల్వ

లింగాల: మండలంలోని పలు గ్రామాల్లో విస్తరించి ఉన్న కేఎల్‌ఐ కాల్వల నిర్వహణ పట్ల సంబంధిత అధికారులు నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తుండడంతో పొలాలకు సాగునీరు అందక రైతులు అవస్థలు పడుతున్నారు. కొన్నేళ్ల కిందట అస్తవ్యస్తంగా ఏర్పాటు చేసిన కాల్వల దుస్థితి నానాటికి దిగజారి పోతుంది. పలు గ్రామాలకు సాగునీరు అందించే కాల్వల కుచించుకపోవడం, తవ్విన కాల్వల లోపలిభాగం రాతి కట్టడం లేక నీటికి ధరులు నాని కూలిపోవడం తదితర సమస్యలు అనేకంగా ఉన్నాయని చెప్పవచ్చు. ముఖ్యంగా కాల్వల్లో రాళ్లురప్పలు కొట్టుకరావడం, చెట్ల పొదలు పెరగడంతో నీటి పారుదల సరిగా జరుగుకపోవడం వంటి సమస్యలు అనేకం ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో కాల్వలకు డిస్ట్రిబ్యూటర్ షట్టర్స్ లేకపోవడంతో చాలా నీరు దిగువకు వృధాగా పోతుందని రైతులు వాపోతున్నారు. తరచుగా కాల్వల నిర్వహణ చేపట్టాల్సిన అధికారులు తమకేమీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం పలు గ్రామాల శివారుల్లో యాసంగిలో అధిక విస్తీర్ణం వేరుశనగ పంటను సాగు చేస్తున్నారు. కాల్వలు సక్రమంగా లేకపోవడంతో రైతులు కాల్వలకు మోటార్లు ఏర్పాటు చేసుకొని సాగునీటిని పొందుతున్నారు. కాల్వల నిర్వహణను చేపట్టి నీటి వృధాను అరికట్టాలని, అన్ని ప్రాంతాలకు సమానంగా సాగునీరు సరఫరా అయ్యేందుకు షటర్లను బిగించాలని రైతులు కోరుతున్నారు.

గుంతల రోడ్లతో ఇబ్బందులు


గుంతలమయంగా ఉన్న దుందుభీ సీసీ రోడ్డు


అంతారం వద్ద గుంతలమయంగా ఉన్న బీటీ రోడ్డు

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలను కలిపే లింకు రోడ్లు, బీటీ రోడ్లు గుంతలమయమై రాకపోకలకు ఆందోళన కలిగిస్తున్నాయి. ఆకునెల్లికుదురు నుంచి అంతారం, గోవిందాయిపల్లి మీదుగా ఐతోల్, జడ్చర్లకు వెళ్లే ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డు బీటీ తేలి కంకరతో గుంతలు అడుగడుగునా ఏర్పడడం వల్ల నరకయాతనగా మారిందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా శిర్సవాడను అనుసరించుకొని దుందుభీ నదిపై వేసిన బీటీ రోడ్డు గుంతలు ఏర్పడడంతో పాటు వర్షాకాలంలో కురసిన వర్షాలకు సిమెంట్ కొట్టుకుపోయి ప్రమాదభరితంగా గుంతలు ఏర్పడ్డాయి. జడ్చర్ల, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్ నియోజకవర్గాలను కలిపే ఈ రోడ్డును అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించి మరమ్మతు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సభకు తరలిన కాంగ్రెస్ నాయకులు


కల్వకుర్తి నుంచి సభకు తరలివెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

కొల్లాపూర్: బిజినేపల్లిలో నిర్వహించిన దళిత, గిరిజన ఆత్మగౌరవ దండోరా సభకు కొల్లాపూర్ నుంచి కాంగ్రెస్ శ్రేణులు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రంగినేని అభిలాష్‌రావు, సీనియర్ నాయకులు చింతలపల్లి జగదీశ్వర్‌రావుల అనుచరులు వేర్వేరుగా పట్టణంలో ర్యాలీలు నిర్వహించారు. వాహనాల కాన్వాయ్‌తో సభకు వారు తరలివెళ్లారు.

పెద్దకొత్తపల్లి: కాంగ్రెస్ ఆధ్వర్యంలో బిజినేపల్లి మండల కేంద్రంలో నిర్వహించే దళిత, గిరిజన ఆత్మగౌరవ సభకు పెద్దకొత్తపల్లి మండలం నుంచి రంగినేని అభిలాష్‌రావు ఆధ్వర్యంలో మోటర్‌సైకిళ్ల ర్యాలీతో కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం సభకు భారీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కృష్ణయ్య, పాపిరెడ్డి, బాబు, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.


పెద్దకొత్తపల్లి నుంచి తరలివెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

కల్వకుర్తి: కాంగ్రెస్ ఆధ్వర్యంలో బిజినేపల్లి మండల కేంద్రంలో నిర్వహిస్తున్న దళిత, గిరిజన సభకు కల్వకుర్తి నుంచి కాంగ్రెస్ నాయకులు వాహనాల్లో తరలివెళ్లారు. సభకు తరలివెళ్లిన వారిలో విజయ్‌కుమార్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, పాండుగౌడ్, గంగయ్యగౌడ్, బండి సుదర్శన్, బాలరాజు, షాకీర్ తదితరులు ఉన్నారు.

తాడూరు: బిజినేపల్లి మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన దళిత, గిరిన ఆత్మగౌరవ సభకు మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల నుంచి కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రోహిణి, బాలాగౌడ్, లక్ష్మయ్య, వెంకటయ్య, బాలకృష్ణ, గోవర్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి

వెల్దండ: మండలంలోని తిమ్మినోనిపల్లికి చెందిన లింగయ్యగౌడ్‌కు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ రూ.40వేల చెక్కును ఆదివారం ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అందజేశారు. ప్రభుత్వ పథకాలను పేదప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రామచంద్రారెడ్డి, సురేందర్‌రెడ్డి, హరికిషన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోండి

లింగాల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మునిరొద్దీన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

కోడేరు: మండలంలోని నర్సాయిపల్లికి చెందిన శీలం ఆనంద్ గత కొన్ని రోజుల కిందట అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందడంతో బాధిత కుటుంబానికి రంగాపూర్ శివారెడ్డి 50కిలోల బియ్యం, నిత్యావసర సరుకులను ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నర్సింహా, అగ్రస్వామి, ఈశ్వరయ్య, రాముడు, అర్జునయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ కరపత్రాల ఆవిష్కరణ



కోడేరు: మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరపాగ చంద్రబాబు ఆధ్వర్యంలో ఆదివారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలకు దళితబంధు ఇవ్వాలని అన్నారు. ఫిబ్రవరి 3న కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా, 14న ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కుర్మయ్య, చందు, పుట్టపాగ మధు, భాస్కర్, మారుతి, మధుబాబు, బాలయ్య, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కల్వకుర్తిరూరల్: ఇటీవల మృతిచెందిన ఫొటోగ్రాఫర్ అయాఫ్ కుటుంబాన్ని ఆదివారం వైఎస్సార్ తెలంగాణ పార్టీ కోఆర్డినేటర్ అర్జున్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. మృతుడి కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సాయాన్ని అర్జున్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో రవికుమార్, పురుషోత్తం, ప్రియాజ్, వాహెద్, హిమాయత్ ఉన్నారు.

ఆహ్లాదకరంగా పల్లెప్రకృతి వనాలు



అంతారంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతివనం


మేడిపూర్‌లో ఏపుగా పెరిగిన మొక్కలు

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో పల్లెప్రగతి కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతివనాలు చూపరులను ఆకట్టుకోవడంతో పాటు ఆహ్లాదాన్ని ఇస్తున్నాయి. మండలంలో 24 గ్రామ పంచాయతీలకు గాను అన్ని గ్రామ పంచాయతీల్లో పల్లెప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. మండలంలోని ఆయా గ్రామాల సర్పంచ్‌లు ప్రత్యేక శ్రద్ధ కనబర్చి మొక్కల కొనుగోలు విషయంలో సొంత డబ్బులు ఉపయోగించి పండ్లు, ఫలాలు ఇచ్చే మొక్కలతో పాటు ఔషధ మొక్కలను ప్రకృతి వనాలలో నాటించారు. ప్రస్తుతం మొక్కలు పెరిగి చూపరులను ఆకట్టుకుంటున్నాయి.

మురుగుకాల్వలు శుభ్రం చేయండి


చెత్తచెదారంతో పూడుకుపోయిన కాల్వ

తాడూరు: మండలంలోని పాపగల్‌లోని 8వ వార్డులో మురుగుకాల్వ శిథిలావస్థకు చేరి చెత్తచెదారంతో పేరుకుపోయింది. దీంతో మురుగునీరంతా నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లుతుందన్నారు. ఆంజనేయస్వామి గుడిని అనుసరించుకొని ఉండడం వల్ల వచ్చిపోయే భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అధికారులు పరిశీలించి మరమ్మతు చేపట్టాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా..


ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

- పదో తరగతి విద్యార్థులకు ప్రతి రోజూ ప్రత్యేక తరగతులు
- 10 మందికి ఒక ఇన్‌చార్జ్ ఉపాధ్యాయుడు

తాడూరు: త్వరలో జరగబోయే పదో తరగతి పరీక్షలను దృష్టిలో ఉంచుకుని మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రతి 10 మంది విద్యార్థుల పర్యవేక్షన కోసం ఒక ఉపాధ్యాయుడు ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నాడు. ప్రతి ఒక విద్యార్థికి వాట్సాప్ వీడియో కాల్ ద్వారా విద్యార్థులను ఎప్పటికప్పుడు సిద్ధం చేస్తున్నారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక కార్యాచరణ తీసుకుంటున్నారు. ప్రభుత్వ ఆదేశానుసారం ఉపాధ్యాయులు పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తమ ఫలితాలు సాధించాలనే ఉద్దేశంతో ప్రణాళికలను రూపొందించారు.

మండలంలో ఇలా..

మండల కేంద్రంతో పాటు బలాన్‌పల్లి, సిర్సవాడ, ఐతోలు, ఇంద్రకల్, మేడిపూర్, కేజీబీవీ పాఠశాలల్లో 249 మంది బాలికలు, 164 మంది బాలురు మొత్తం 413 మంది బాలబాలికలు పదో తరగతి పరీక్షలకు సిద్ధం అవుతున్నారు. ప్రస్తుతం మండల కేంద్రంలోని పాఠశాల, సిర్సవాడ ఉన్నత పాఠశాల భవన నిర్మాణాలు ఎంజేఆర్ ట్రస్టు ద్వారా కొనసాగుతున్నాయి. మండల కేంద్రంలో జూనియార్ కళాశాలలో పాఠశాల కొనసాగుతుంది. ఉదయం 8 నుంచి 9గంటల వరకు సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు ఆయా సబ్జెక్టులపై ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా అన్ని సబ్జెక్టుల్లో విద్యార్థులు సత్తా చాటేలా తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో బోధన చేపట్టారు.

ప్రత్యేక ప్రణాళికలతో..

ఇన్‌చార్జ్‌గా ఉన్న ఉపాధ్యాయులు విద్యార్థుల కోసం ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూప్‌లను ఏర్పాటు చేశారు. ప్రతి రోజూ ఉదయం విద్యార్థులు నిద్ర లేచి చదువుతున్నారా లేదా తెలుసుకునేందుకు 5గంటలకు వాట్సాప్ వీడియో కాల్ చేసి పరిశీలిస్తున్నారు. విద్యార్థులకు సందేహాలు ఉన్నా అప్పటికప్పుడు ఉపాధ్యాయులు నివృత్తి చేస్తున్నారు. ఈ ఏడాది వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా ప్రత్యేక ప్రణాళికతో సిద్ధం చేస్తున్నామన్నారు.

ఉపాధ్యాయుల ప్రత్యేక శ్రద్ధ..



పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. తరగతి గదుల్లోనే కాకుండా ఇంటి వద్ద ఉన్నప్పుడు ఏ చిన్న సందేహం ఉన్నా అర్థమయ్యే రీతిలో చర్యలు తీసుకుంటున్నారు.

– ఐశ్వర్య, విద్యార్థి, పదో తరగతి

ప్రతి రోజూ తరగతులు..



పదో తరగతిలో పట్టు సాధించేలా ఉపాధ్యాయులు మెళకువలు నేర్పించడంతో పాటు బోధనలో మార్పు చేపట్టారు. వారి సూచనల మేరకు ప్రతి రోజూ ప్రత్యేక తరగతులు వింటూ వంద శాతం ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నాం.

– అరవింద్ గౌడ్, విద్యార్థి, పదో తరగతి

అన్ని సబ్జెక్టుల్లో పట్టు సాధించేలా..



పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. ప్రత్యేక తరగతుల ద్వారా విద్యార్థులు అన్ని సబ్జెక్టుల్లో పట్టు సాధించేలా శిక్షణ ఇస్తున్నాం. ప్రతి వారం ఒక సబ్జెక్టుపై స్లిప్‌టెస్టు పెడుతున్నాం. చదువులో వెనకబడి ఉన్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం.

– తిరుపతయ్య, కాంప్లెక్స్ హెచ్‌ఎం, సిర్సవాడ

ఐకమత్యంతో హక్కులు సాధించుకోవాలి

వెల్దండ: గౌడ కులస్తులంతా ఐక్యమత్యంతో ఉండి తమ హక్కులను సాధించుకోవాలని గౌడ సంఘం మండల అధ్యక్షుడు మట్ట వెంకటయ్యగౌడ్ పేర్కొన్నారు. ఆదివారం వెల్దండలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గౌడ కులస్తుల సమస్యలను సాధించుకోవాలన్నారు. అర్హులైన వారందరికీ లైసెన్స్‌లు ఇవ్వాలని, ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు వెంటనే నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గీతా కార్మికులందరికీ ఫించన్ అందించాలన్నారు. ఈనెల 23న కేఎల్‌ఆర్ గార్డెన్‌లో గౌడ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణకు ముఖ్యఅతిగా మాజీ శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్, గౌడ సంఘం రాష్ట్ర నాయకులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటయ్యగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజుగౌడ్, విష్ణుగౌడ్ పాల్గొన్నారు.